క్లుప్తంగా

పేరుకుపోతున్న చెత్త

మాచర్ల: పట్టణంలోని పురపాలక సంఘ పారిశుద్ధ్య కార్మికులను విజయవాడకు వరద బాధితుల సహాయార్థం పంపారు. దీంతో స్థానికంగా పలు ప్రాంతాలలో చెత్తాచెదారం తీసేవారు లేక పేరుకుపోతోంది. రింగు రోడ్డు సెంటర్, బస్టాండ్, రైల్వే స్టేషన్ వీధి, అనేక చోట్ల చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్య కార్మికులు ఐదు రోజుల క్రితం వెళ్లారు. ఆదివారం మరోసారి 25 మందిని విజయవాడకు పంపారు.

కారెంపూడి మాజీ సర్పంచ్ మృతి

కారెంపూడి: కారెంపూడి గ్రామ మాజీ సర్పంచ్ అన్నపరెడ్డి వెంకటేశ్వర్లు (70) శనివారం మృతి చెందారు. కొంత కాలంగా వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధపడుతున్నారు. స్థానిక దాచేపల్లి వెళ్లే రోడ్డులో ఉన్న ఆయన నివాసంలో శనివారం సాయంత్రం మృతి చెందారు. ఆయన మృతి పట్ల పలువురు మాజీ సర్పంచ్‌లు, వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

పాస్టర్ ఫెలోషిప్ కార్యవర్గం ఎన్నిక



మాచర్ల: పట్టణంలోని ఏసయ్య ఫెలోషిప్ కమిటీని ఎంపిక చేసినట్లు అధ్యక్షుడు పొట్టిపోగు మరియదాసు తెలిపారు. పట్టణ, నియోజకవర్గంలోని పలు చర్చిల పాస్టర్లు నరిశెట్టి కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించి, కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా మాచర్ల రామారావు, ఉపాధ్యక్షుడిగా పిన్నపాటి సునీల్, ప్రధాన కార్యదర్శిగా అల్లి సిల్వటర్ట్, కోశాధికారిగా బొమ్ము రాజు, సంయుక్త కార్యదర్శి గాదె ఇస్సాకు, మీడియా అధికార ప్రతినిధి ఆదిరాల ప్రసాద్, సభ్యులు పాల్, నోముల జక్రయ్య, బుజ్జిబాబు, మోషే, రమేష్‌ను ఎన్నుకున్నట్లు చెప్పారు.

మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఇంట్లో చోరీ

వెల్దుర్తి: మండలంలోని గొట్టిపాళ్ల గ్రామంలో శనివారం అర్ధరాత్రి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు పల్లపాటి గురుబ్రహ్మం ఇంట్లో చోరీ జరిగింది. ఎవరూ లేని సమయంలో ఇంటి తలుపులు పగలకొట్టి రూ.2 లక్షల విలువైన వస్తువులు దొంగతనం చేశారు. బంధువులు గురుబ్రహ్మంకు విషయం తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఎం.సత్యనారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వాషింగ్ మిషన్, ఫ్రిడ్జ్, ఏసీ, ఇలా విలువైన వస్తువులను దొంగిలించారని, వాటి విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

నేడు అవధాన కళాకేళి

నరసరావుపేట ఈస్ట్: అవధాన పురస్కారాల ప్రదానం, అవధాన కళాకేళి సోమవారం నిర్వహించనున్నట్లు శ్రీనరసరావుపేట కళా వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి ఆదివారం తెలిపారు. శ్రీశృంగేరి శంకరమఠంలోని శ్రీభారతీ తీర్థమహాస్వామి ప్రాంగణంలో సోమవారం సాయంత్రం ఐదు గంటలకు శ్రీకొప్పరపు కవుల కళాపీఠం, శ్రీనరసరావుపేట కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో కళాపీఠం 22వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాలలో భాగంగా ద్విభాషా శతావధాని పాలడుగు శ్రీచరణ్ అష్టావధాన ప్రక్రియ నిర్వహిస్తారని వివరించారు. అలాగే కొప్పరపు సీతారామప్రసాదరాయ కవి శత జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అవధాన పండితులు మాడుగుల నాగఫణిశర్మ, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, బులుసు అపర్ణ, కడిమెళ్ల వర ప్రసాద్ తదితరులను పురస్కారాలతో సత్కరించనున్నట్టు వెల్లడించారు. తెలుగు భాషాభిమానులు, కళాకారులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత యోగ శిక్షణ శిబిరం

నరసరావుపేట ఈస్ట్: శ్రీవేంకటేశ్వర యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఉచిత యోగ శిక్షణ శిబిరం ఆదివారం నుంచి ప్రారంభించినట్లు ఉపబోధక యోగా గురువు జల్లి శ్రీనివాసరావు తెలిపారు. బరంపేటలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ఆవరణలోని శ్రీసీతారామ కళ్యాణ మండపంలో ప్రతిరోజు ఉదయం 5 నుంచి 7గంటల వరకు 28రోజుల పాటు యోగ శిక్షణ ఉంటుందని వివరించారు. వివరాలకు 9247191553లో సంప్రదించాలని కోరారు.

గజాననాయ నమః గణాధ్యక్షాయ నమః

ఏ వీధి చూసినా.. ఏ వాడ చూసినా జై బోలో గణేష్ మహరాజ్‌కి జై.. అనే నినాదాలే. వినాయక చవితి ఉత్సవాలు అంబరాన్నంటాయి. పందిళ్లలో లంబోదరుడి భారీ విగ్రహాలు వివిధ ఆకృతుల్లో కొలువుదీరాయి. విఘ్నాలు తొలగించాలని భక్తులు నిండు మనసుతో గణనాథుడిని కనులారా దర్శించుకుని వేడుకున్నారు. నైవేద్యాలు సమర్పించారు. పూజలు చేశారు. భక్తి గీతాలను ఆలపించారు.

– సాక్షి నెట్‌వర్క్


రెంటచింతల ఆనంద్ పేట కాలనీలో భారీ గణనాథుడు


గురజాల నాయుడు బజారులో కొలువుదీరిన గణనాథుడికి పూజలు


విజయపురి సౌత్ మెయిన్ బజార్‌లో పూజలు అందుకుంటున్న గణేషుడు


మాచర్ల ఎంఎస్ఆర్ టౌన్ షిప్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం


రెంటచింతల వడ్డెర బావి సెంటర్‌లో మట్టి గణపయ్య


మాచర్ల పత్తి ఫ్యాక్టరీ ప్రాంతంలో వినాయకుడు


పిడుగురాళ్ల: పట్టణంలోని ఏడు కోట్ల సెంటర్‌లో చిన్నారుల భరతనాట్యం ప్రదర్శన


పిడుగురాళ్ల: పట్టణంలోని గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు


నారాయణపురం రెడ్ల బజార్‌లో వినాయకుడి విగ్రహం వద్ద పూజలు


దాచేపల్లిలో మేళతాళాలతో లడ్డూల ఊరేగింపు


కారెంపూడి గాంధీ బొమ్మ సెంటర్‌లో భక్తుల పూజలు

వరద బాధితులకు బాసట


పిల్లుట్ల రోడ్డులోని షాదీఖానా నుంచి సరుకుల లారీని ప్రారంభిస్తున్న నాయకులు


ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిత్యావసరాల తరలింపు


రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..

పిడుగురాళ్ల: పట్టణ ముస్లిం మైనార్టీ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు నిత్యావసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సహాయ సహకారాలతో సాయమందించినట్లు ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు మస్తాన్ వలి తెలిపారు. నాయకులు బాబావలి, అమీర్ అలీ, సైదావలి, ముజీబ్, బాషా, మీరావలి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రోటరీ క్లబ్ సాయం

పిడుగురాళ్ల: వరద బాధితుల సహాయార్థం రోటరీ ఆపద్బాంధువు ప్రాజెక్టులో భాగంగా రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ శరత్ చౌదరి ఆదేశాలతో 25 రోటరీ క్లబ్‌ల సహాయంతో రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ వరద ప్రభావిత ప్రాంతాలైన తెనాలి, రేపల్లే పరిసర ప్రాంతాలలోని లంక గ్రామాల్లో సుమారు రెండు వేల కుటుంబాలకు రూ. 20 లక్షలతో నిత్యావసర పంపిణీ కార్యక్రమం ఆదివారం చేపట్టింది. పిడుగురాళ్ల రోటరీ క్లబ్ అధ్యక్షుడు గుండా అశోక్ బాబు నిత్యావసర సరుకుల వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. రోటరీ క్లబ్ సభ్యులే వరద ప్రభావిత లంక గ్రామాల్లో సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ డీజీఈ రాంప్రసాద్, హరిహరప్రసాద్, పిడుగురాళ్ల కార్యదర్శి నీరుమళ్ల రాజేశ్, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

మాచర్ల: పట్టణం నుంచి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భారీ స్థాయిలో నిత్యవర వస్తువులను విజయవాడ వరద బాధితులకు పంపారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచనల మేరకు బియ్యం, కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు రూ.లక్షకు పైగా విలువైన వస్తువులను వరద బాధితులకు అందించేందుకు ప్రత్యేక లారీలో తరలించారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, సూరె యలమంద, భవనాశి వెంకటేశ్వర్లు, దారివేముల రామకృష్ణ, కంభంపాటి అనిల్‌కుమార్, కంభంపాటి చంటి తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు.


సాగర్‌మాత దేవాలయంలో తేరు ప్రదక్షిణ

తేరు ప్రదక్షిణ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ దైవ సందేశాన్ని పాటించి సమాజంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు పొందాలని చెప్పారు. అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తేరు ప్రదక్షిణలో భక్తులు భారీగా పాల్గొన్నారు.

– విజయపురిసౌత్

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

నరసరావుపేట రూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడిని ఈ నెల 4న కోటప్పకొండ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రూరల్ ఎస్ఐ సిహెచ్.కిషోర్ అక్కడకు చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధుడిని ఏరియా వైద్యశాలలో చేరి్పంచారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం వృద్ధుడు మృతిచెందాడు.

చికిత్స కోసం 'వెస్సో' ఆర్థిక సాయం



పిడుగురాళ్ల: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయై చికిత్స పొందుతున్న తాళ్లూరి శ్రీనివాసచారి వైద్య ఖర్చుల నిమిత్తం వెస్సో ట్రస్టు ద్వారా రూ.54,800ల సాయం అందించినట్లు ట్రస్టు అధ్యక్షుడు బంగారు తాతారావు ఆదివారం తెలిపారు. పట్టణానికి చెందిన శ్రీనివాసచారి చిరుద్యోగి. గుంటూరు ప్రైవేటు హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న తన తండ్రికి సర్జరీ చేయించేందుకు కుమార్తె సంధ్య ఆర్థిక సాయం కోసం వెస్సో ట్రస్టును ఆశ్రయించింది. పిడుగురాళ్ల సామాజిక సేవకుడు రాగి నరసింహారావు చేతుల మీదుగా నగదు చెక్కును కుటుంబ సభ్యులకు అందించి, సాయం చేశారు. దీంతో అధ్యక్షుడు తాతారావు దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

ఉపవాస ప్రార్థనలు



దాచేపల్లి: ప్రకృతి విపత్తుల నుంచి కాపాడేందుకు ఉపవాసంతో క్రీస్తుని ప్రార్థించాలని పాస్టర్ రెవ. జీఎస్ ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని కేసానుపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయంలో ఉపవాస ప్రత్యేక ప్రార్థనలు ఆదివారం నిర్వహించారు. భారీ వర్షాల నుంచి ప్రజలను కాపాడాలని, పంటల దిగుబడులు రావాలని, సీజనల్ రోగాలు తొలగిపోవాలని ప్రార్థనలు చేశారు. పాస్టర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. పవిత్రంగా చేసే ప్రార్థనలు క్రీస్తు ఆలకించి, జవాబు అనుగ్రహిస్తారని చెప్పారు. ప్రత్యేక గీతాలను ఆలపించారు. వినుకొండ అజయ్‌కుమార్, వజ్రం బృందం గీతాలను ఆలపించారు. ఏఈఎల్‌సీ డేలిగేట్ వినుకొండ బాబు, చర్చి డేలిగేట్ శ్రీపతి కాశయ్య, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



నరసరావుపేట రూరల్: రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ కె.నాగేశ్వరరావు హెచ్చరించారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు మంచి ప్రవర్తన కలిగి సమాజానికి ఉపయోగపడేలా జీవించాలని కోరారు.

ప్రజా శాంతికి విఘాతం కలిగిస్తూ, అసాంఘిక కార్యక్రమాలకు నిర్వహిస్తే తీవ్ర చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదన్నారు. రౌడీషీటర్లపై గట్టి నిఘా కొనసాగుతుందని తెలిపారు. వినాయక చవితిని పురస్కరించుకొని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిమజ్జన ఊరేగింపులు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఉత్సవ కమిటి ప్రతినిధులు పోలీసులకు సహకరించాలని కోరారు.

కోతుల స్వైర విహారం.. ఇద్దరికి గాయాలు

నరసరావుపేట: స్థానిక అరండల్‌పేటలో నివాసం ఉంటున్న విజయ్‌కుమార్, బండారు మాధవిలపై శనివారం కోతులు దాడి చేశాయి. ఈ దాడిలో మాధవి చేతి మణికట్టు తెగిపోయింది. వెంటనే ఆమెకు స్థానిక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయించారు. కాగా, ఇటీవల కోతుల దాడి నుంచి తప్పించుకోబోయి కింద పడి 19వ వార్డుకి చెందిన మరో మహిళ గాయపడింది. వరవకట్ట, ప్రకాష్‌నగర్, అరండల్‌పేటలో విపరీతంగా కోతులు సంచరిస్తున్నాయి. వీటి నుంచి తమను రక్షించాలని పట్టణ ప్రజల కోరుతున్నారు.

ఉపాధ్యాయుడు రవికుమార్‌కు అవార్డు ప్రదానం


రవికుమార్‌కు అవార్డు, ప్రసాంశపత్రంతో సన్మానం

దాచేపల్లి : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న కొసూరి రవికుమార్‌ను లయన్స్ క్లబ్ ఆఫ్ జయహో ఉమ్మడి గుంటూరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసింది. ఆదివారం గుంటూరులోని కేఎస్ఆర్ నర్సింగ్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు, ప్రశంసా పత్రాన్ని రవికుమార్‌కి ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాలల అదనపు డైరెక్టర్ రాసంశెట్టి నరసింహారావు, విశ్రాంత డీఈవో వై. చంద్రమోహన్, క్లబ్ అధ్యక్షుడు ముట్లూరి వెంకయ్య అందజేశారు. కవి, రచయితగా, ఉపాధ్యాయుడిగా రవికుమార్ పనిచేయడం సంతోషంగా ఉందని నరసింహారావు అన్నారు. హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

మహిళా సంక్షేమ సేవా సంఘం కార్యదర్శిగా జయమ్మ


రాయపాటి జయమ్మ

మాచర్ల: జాతీయ గ్రామీణ, పేద, మహిళా సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాయపాటి జయమ్మను రాష్ట్ర కమిటీ ఎంపిక చేసినట్లు జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు, గౌరవ సలహాదారు జెట్టిపాలెం వెంకటేష్ జాంబవరాజు, రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలు పేరువాల పద్మకుమారి తెలిపారు. ఆదివారం మహిళా సంక్షేమ సేవా సంఘంలో వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ పేద మహిళలను ఏకం చేసేందుకు సంఘం పనిచేస్తుందన్నారు. మొదటి నుంచి మహిళా సమస్యల పరిష్కారంలో ఎంతో ముందంజలో ఉన్న రాయపాటి జయమ్మ కృషిని గమనించి రాష్ట్ర కార్యవర్గం ఆమెను ఎంపిక చేయటం జరిగిందన్నారు. జయమ్మను సంఘం ఉపాధ్యక్షురాలు రమావత్ మాంగో, కార్యదర్శి పేరువాల శ్రీదేవి, సంయుక్త కార్యదర్శి కేతావత్ దేవి, కోశాధికారి కడియం సత్తమ్మ, కార్యవర్గ సభ్యులు కడియం సత్తమ్మ, వడ్డమూడి భూలక్ష్మి చౌదరి, బత్తుల విజయ, దాసరి విశ్రాంతి అభినందించారు.

మళ్లీ వర్షం..

మాచర్ల: పట్టణంలో శుక్రవారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మరోసారి భారీ వర్షం కురిసింది. నియోజక వర్గంలోని చెరువులు, కాల్వలు పొంగి పొర్లటంతో చంద్ర వంకలోకి నీరు చేరి భారీగా ప్రవహిస్తోంది. దిగువ ప్రాంతాల్లో నీరు నిలిచింది. రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. చిరు జల్లులు పడుతూనే ఉన్నాయి.


రోప్‌వే కాలనీ రహదారిలో నిలిచిన వర్షపు నీరు